
హైదరాబాద్ వార్త



## అభయవాస్తం దరఖాస్తుల కంప్యూటీరీ కరణను పరిశీలించిన కలెక్టర్



బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లో జరుగుతున్న అభయవాస్తం దరఖాస్తుల కంప్యూటరీ కరణనుపరిశీలిస్తున్న కలెక్టర్ కె.శశాంక

నార్సింగి, జనవరి 8 ప్రబాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లో జరుగుతున్న అభయహస్తం దరఖాస్తుల కంప్యూటరీ కరణను సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక పరిశీలించారు. అడిషనల్ కలెక్టర్ ప్రతిమసింగ్, కార్పోరేషన్ కమీషనర్ శరత్‌చంద్రలతో కలిసి కలెక్టర్ శశాంక సిబ్బందికి డాటా ఎంట్రీ చేసే విధానంపై పలు సూచనలు చేశారు. అభయ హస్తం కింద మహాలక్ష్మీ, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పతకాలకు దరఖాస్తు చేసుకున్న వారి అందరి వివరాలు జాగ్రత్తగా ఎంట్రీ చేయాలన్నారు. బండ్లగూడ కార్పోరేషన్‌లో ఎంత మంది ఏ ఏ పతకాలకు దరఖాస్తు చేసుకున్నారో సులభంగా తెలిసేలా కంప్యూటరీకరణ చేయాలని తెలిపారు. వివరాలన్నింటిని కంప్యూటరీకరణ చేసిన తరువాత అర్హులను గుర్తించేందుకు విచారణ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, సూపర్‌వైజర్లు, వార్డు అధికారులు పాల్గొన్నారు.

## నాన్ టీచింగ్, వర్కర్స్ వేతనాలు పెంచాలి

**ప్రగతిశీల కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల నాన్ టీచింగ్, వర్కర్స్ అసోసియేషన్**



రాష్ట్ర మంత్రి సీతక్కకు వినతి పత్రాన్ని అందజేస్తున్న ఎస్.ఎల్.పద్మ

సైఫాబాద్, జనవరి 8 ప్రభాతవార్త: రాష్ట్రంలో ఉన్న 475 కస్తూర్భా గాంధీ బాలికల విద్యాయాల్లో, మోడల్ స్కూల్ హాస్టళ్ళలో పనిచేస్తున్న నాన్ టీచింగ్, వర్కర్స్ వేతనాలు ప్రభుత్వం పెంచాలని, బేసిక్ పేను నిర్ణయించాలని, రెగ్యుల రైజ్ చేయాలని ప్రగతిశీల కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల నాన్ టీచింగ్, వర్కర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సోమవారం రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు అసోసియేషన్ అధ్యక్షురాలు ఎస్.ఎస్.పద్మ వినతి పత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ వివిధ గురుకుల సంస్థల్లో రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తున్న వేతనాలకు కేజీబీవిల్లో ఉద్యోగులకు చెల్లిస్తున్న వేతనాల్లో చాలా వ్యత్యాసం ఉందని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, వేతనాలు తక్షణమే పెంచాలని, బీమా సౌకర్యం కల్పించాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తగిన సిబ్బందిని నియమించాలని, వేతనాలు ప్రతి నెల 5వ తేదీలోగా చెల్లించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలను తక్షణమే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. తమ డిమాండ్లపై మంత్రి స్పందించారని ఆమె చెప్పారు.

## విద్యార్థులు సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

**ఉస్మానియా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.లక్ష్మినారాయణ**

చిక్కడపల్లి, జనవరి 8 ప్రభాతవార్త: విద్యార్థులు మరిన్ని ఆచణాత్మక అంశాలపై దృష్టిని కేంద్రీకరించి సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఉస్మానియా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.లక్ష్మినారాయణ అన్నారు. సోమవారం నేషనల్ రిమోట్ సెన్సింగ్ కేంద్రం(ఇస్రో) ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్-2024పై కర్టెన్ రైజర్ కార్యక్రమం జరిగింది. ప్రధానంగా సాంకేతికత అంశంపై దృష్టినిసారించడంతో పాటు సమాజనికి సేవ చేయాలని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఇస్రో శాస్త్రవేత్తలఉ చేస్తున్న ప్రయోగాలు చరిత్ర సృష్టించడంతో పాటు ప్రపంచంలో భారత్‌ను ఉపగ్రహాలు ప్రయోగించడంలో మొదటిస్థానంలో నిలిపిందన్నారు. ఎన్ఆర్ఎస్‌సి లోని లైవ్‌స్టేట్ ఆఫ్ ఆర్ట్ ఎక్విప్‌మెంట్ నుంచి నేర్చుకోవడంతో పాటు అర్థం చేసుకోవడానికి విద్యార్థులకు ఇదో గొప్ప అవకాశం అని, ఇందుకు సహకరించిన ఎన్ఆర్ఎస్‌సి బృందంను అభినందించింది. డైరెక్టర్(ఇన్‌ఫ్రా) ప్రొఫెసర్ పి.నవీన్‌కుమార్ మాట్లాడుతూ ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎన్ఆర్ఆర్‌సి, ఇస్రో, ఓయుల మధ్య అతి త్వరలో ఒప్పందం కుదుర్చుకోబోతున్నామని, ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థినీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్టులు అందించడంతో పాటు ఎన్ఆర్ఎస్‌సి ఓటరీచ్ కంటెంట్‌ను ప్రసారం చేయడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

## అక్రమ నిర్మాణాలపై ఎమ్మార్వోకు ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

జీడిమెట్ల, జనవరి 8, ప్రభాతవార్త : కొంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భైరి ప్రశాంత్‌గౌడ్, కొంపల్లి, దూలపల్లి చెరువులపై, నాళాలపై నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను వెంటనే కూల్చివేయాలని సోమవారం దుండిగల్ ఎమ్మార్వోని కలిసి అక్రమ నిర్మానాలపై ఫిర్యాదు చేశారు. ఫాక్స్ సాగర్ నాలా ఎఫ్‌టిఎల్ బఫర్ జోన్‌పై మట్టి నింపుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్‌ని కూడా కలిసి నివేదిక అందజేశారు. ఈ కార్యక్ర మంలో కావలి గోపాల్ ముదిరాజ్, జయబేరి గోపాల్‌రెడ్డి, ప్రభాకర్ గుప్త, కావలి నవీన్ ముదిరాజ్ పాల్గొన్నారు.

# ప్రయాణ గోస!

## సామాన్యులకు భారంగా సంక్రాంతి ప్రయాణం



- పండుగ పేరుతో ప్రవేటు బస్సుల దోపిడీ
- సొంతూళ్ళకు వెళ్లడం సామాన్యులకు భారం
- ప్రత్యేక రైళ్లు బస్సులను ఏర్పాటు చేయాలి
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రయాణికుల విజ్ఞప్తి
- ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లే వారిపై మరింత భారం

**రిజర్వేషన్లు దొరకని స్థితి..** పండగ రోజుల్లో దక్షిణ మధ్యరైల్వే ప్రత్యేక రైళ్లను ప్రయాణికులకు అనుగుణంగా ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల 20 ప్రత్యేక రైళ్లను కెటాయించినప్పటికి ఎక్కువ రద్దీ ఉండే హైదరాబాద్ విశాఖపట్నం మధ్య ఒక రైలును కూడా కేటాయించలేదు. దీంతో ఉత్తరాంధ్రకు వెళ్లే ప్రయాణికులపై చార్జీల భారం పడుతుంది. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం మధ్య నిత్యం తిరిగే ఈస్ట్ కోస్ట్, కోణార్క్, ఫలక్‌నూమా విశాఖ, గోదావరి, గరీబ్‌రథ్, నాందేడ్,విశాఖ రైళ్లతో పాటు వీక్లీ రైళ్ల టికెట్లన్ని ఇప్పటికే అమ్ముడుపోయాయి. కొన్ని రైళ్లలో వెయిటింగ్ జాబితా వందల్లో ఉండగా, మరికొన్ని రైల్లో రిగ్రేట్ వస్తుంది. ఫలితంగా ప్రయాణికులకు ప్రైవేట్ ట్రావెల్స్ తప్ప మరో ప్రత్యామ్నాయము కనిపించడం లేదు. హైదరాబాద్ నుంచి బయలుదేరి తెలంగాణ, ఆంధ్ర ఆర్టీసీ రెగ్యులర్ బస్సుల్లో ఇప్పటికే టికెట్లన్నీ అయిపోయాయి. రద్దీ దృష్ట్యా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తగిన బస్సు,రైళ్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

తార్నాక, జనవరి 8 ప్రభాతవార్త: సంక్రాంతి పండుగ సీజన్ మొదలైంది. ఈ పండుగకు హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు వెళ్లాలంటే ప్రయాణికులు భయపడాల్సిన పరిస్థితి. పండుగ రద్దీని ఆసరగా చేసుకున్న ప్రైవేటు బస్సు యాజమాన్యాలు టికెట్ల ధరలను విపరీతంగా పెంచి సామాన్య ప్రజలను దోపిడి చేస్తున్నాయి. ఆంధ్రుల ఇష్టమైన పండుగ సంక్రాంతికి హైదరాబాద్ నుంచి ఆంధ్ర జిల్లాలకు వెళ్లడం ప్రతి సంవత్సరం జరుగుతుంది. అధిక సంఖ్యలో ప్రయాణికులు జనవరి 11 నుంచి వెళ్లుతుంటారు. తిరిగి 16 తరువాత నగరానికి వస్తుంటారు. సాధారణ రోజులతో పోలిస్తే సంక్రాంతి సీజన్‌లో ఒక వారం రోజుల పాటు మూడింతలు ప్రయాణికులు రెట్టింపుగా ఉంటారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రైవేట్ బస్సుల వారు ఇష్టాను సారంగా చార్జీలను రెట్టింపు చేశారు. దీంతో సామాన్యులకు భారంగా సంక్రాంతి ప్రయాణం మారింది. ఇప్పటికే రైలు నిండిపోవడం, రద్దీకి తగినన్ని ఆర్టీసీ బస్సు సర్వీసులు లేకపోవడం, ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలకు వరంగా మారింది. సంక్రాంతి పండుగకు ప్రజలు వెళ్లే ఏపీ లోని రాజమహేంద్రవరం, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉంటుంది. వీరంతా సాధారణంగా జనవరి 11, 12, 13 తేదీల్లో హైదరాబాద్ నుంచి స్వంత ఊర్లకు వెల్లుతుంటారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంత్సరం కూడా ఆయా తేదీల్లో ప్రైవేట్ బస్సులో చార్జీలను భారీగా పెంచేశారు. చాలా సర్వీసుల్లో వెయ్యి నుండి రూ. 2వేల మధ్యలో పెరిగిన టికెట్ ధరలు చూసి ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. తిరుగు ప్రయాణానికి ఇదే స్థాయిలో వడ్డెన ఉంది. దీంతో ఒకరు పండగ సమయంలో హైదరాబాద్ నుంచి విశాఖపట్నం ప్రైవేట్ ట్రావెల్స్‌లో వెళ్లి రావాలంటే రూపాయలు రూ. 8వేల నుంచి 9 వరకు వెచ్చించాల్సిన పరిస్థితి. మరో వైపు చిత్తూరు, కడప, విజయవాడకు వెళ్లే బస్సుల్లో సైతం సాధారణ చార్జీల కంటే రూ. 500 నుండి రూ. 1200 వరకు అధనంగా చార్జీలు ఉన్నాయి. ప్రైవేట్ బస్సులో నగరం నుంచి విశాఖపట్నంకు సాధారణ రోజుల్లో ఏసీ స్లీపర్ టికెట్ ధర రూ. 1500 నుంచి రూ. 2వేల వరకు ఉండగా పండగ సమయంలో రూ. 4వేల నుంచి రూ.నాలుగున్నర వరకు ఉంది.ఏసి సీటర్ టికెట్ ధరను రూ.1200 నుండి రూ. 1800, రూ. 3 వేల నుండి రూ.3500 వరకు పెంచారు. నాన్ ఏసీ స్లీపర్ టికెట్ ధర సాధారణ రోజుల్లో రూ. 1500 నుంచి రూ.1800 ఉంటే సంక్రాంతి ముందు రూ.3500 నుండి రూ.4వేల వరకు ఉంది. నాన్ ఏసీ సీటర్ టికెట్ ధరను రూ.వేయి నుంచి రూ.1500 ఉండగా రూ. 2500 నుంచి రూ. 3 వేల వరకు పెంచారు.



దరఖాస్తులను కంప్యూటర్లలో పొందుపరుస్తున్న ఆపరేటర్లు

## కుత్బుల్లాపూర్‌లో ప్రజా పాలన దరఖాస్తుల పరిశీలన వేగవంతం

**కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్లల్లోనే 70 వేల దరఖాస్తులు**

కుత్బుల్లాపూర్, జనవరి 8 ప్రభాతవార్త: కొత్త ప్రభుత్వం ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలనలో పని ప్రారంభించింది. జనవరి ఆరు వరకు నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా దరఖాస్తులు వెల్లువెత్తాయి. కేవలం కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్లలో సుమారు 70వేల దరఖాస్తులు వచ్చాయంటే ప్రజాపాలనకు వచ్చిన స్పందనను అంచనావేయవచ్చు. దరఖాస్తులను కంప్యూటరీకరణ చేయడం కోసం సుమారు 50మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించి పనులను నిర్వహిస్తున్న తీరు ఆశ్చర్యానికి గురిచేస్తుంది. జనవరి 12లోపు ప్రతి దరఖాస్తు డాటా నమోదు కావాలనే ఉద్దేశంలో నిరంతరం పనిచేస్తున్నారు. షిఫ్టుల వారీగా ఆపరేటర్లను నియమించి దరఖాస్తులను నమోదు చేస్తున్నారు. ఈనెల 17తేదీవరకు ప్రభుత్వ పరంగా డాటాపనులు పూర్తిచేసి ప్రభుత్వానికి అందజేయాలనే లక్ష్యంతో అధికారయంత్రాంగం తలమునకలైంది.

## 18 నుంచి 21 వరకు ఆల్ ఇండియా రాజీవ్‌గాంధీ క్రికెట్ పోటీలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వి.హనుమంతరావు

సైఫాబాద్, జనవరి 8 ప్రభాతవార్త: 43వ ఆల్ ఇండియా శ్రీరాజీవ్ గాంధీ అండర్-19 (డి/ఎన్) ట్వాంటీ-20 లీగ్ క్రికెట్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలు ఈ నెల 18వ తేదీ నుంచి 21వ తేదీ వరకు హైదరాబాద్ నగరంలో నిర్వహిస్తున్నామని క్రికెట్ ఫెడరేషన్ ఛైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు తెలిపారు. సోమవారం ఫతేమైదాన్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీలు ఎల్‌బి స్టేడియం, అత్తాపూర్‌లోని విజయానంద్‌గ్రౌండ్, అంబర్‌పేట వాటర్ వర్క్స్ గ్రౌండ్, పిర్జాదిగూడ బాబురావు సాగర్ గ్రౌండ్‌లో జరుగుతాయని చెప్పారు. తొలి మ్యాచ్ శ్రీలంక-హైదరాబాద్‌ల మధ్య జరుగుతుందన్నారు. ఆనంతరం శ్రీలంక, మలేషియా, వివిధ రాష్ట్రాల జట్లు మధ్య పోటీలు జరుగుతాయని, 18వ తేదీ ఉదయం ఈ పోటీలను కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జీ దీపాదాస్‌మున్షి ప్రారంభిస్తారని 21వ తేదీన ఎల్‌బి స్టేడియంలో ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పాల్గొంటారని ఆయన వివరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రోహిన్‌రెడ్డి, ఎస్.శ్రీకాంత్‌గౌడ్, ఆర్.లక్ష్మణ్‌యాదవ్ పాల్గొన్నారు.

## ఉద్యోగులకు క్రీడా పోటీలు

గన్‌ఫౌండ్రి, జనవరి 8 ప్రభాతవార్త: తెలంగాణ టిఎన్‌జిఓ హైదరాబాద్ జిల్లా ఆద్వర్యంలో టిఎన్‌జిఓ ఉద్యోగుల క్రీడా పోటిలు జరిగాయి. తొమ్మిదవ ఎట్టం సదానంద్ క్రికెట్ టోర్నమెంట్ క్వార్టర్స్ ఫైనల్స్ ఆటపోటిలు జరిగాయి. గాంధీ ఆసుపత్రిపై జిల్లా స్టాంప్సు అండ్ రిజిస్ట్రేషన్, వాటర్‌వర్క్స్, హైదరాబాద్ యూత్ ఫోర్స్, క్లాస్ పోర్ట్‌పై వక్స్‌బోర్డు, ఉస్మానియా కళాశాలపై ఆర్‌టిఏ, డి.ఈ.ఓపై సి.ఆర్.ఓ జట్లు విజయం సాధించాయి.

## 22,880 కోట్ల రూపాయల విలువగల 286 ఎకరాల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి

- కబ్జా చేస్తున్న వ్యక్తులపై కఠినంగా చర్యలు తీసుకోవాలి
- సిఎం రేవంత్‌రెడ్డికి సిపిఐ నేత కూనంనేని లేఖ
- విలేకరుల సమావేశంలో ఇ.టి.నర్సింహ్మా వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న ఇ.టి.నర్సింహ్మా, స్టాలిన్

సైఫాబాద్, జనవరి 8 ప్రభాతవార్త: కబ్జాకు గురైన 22,880 కోట్ల రూపాయల విలువగల 286 ఎకరాల భూమిని ప్రభుత్వం స్వాదీనం చేసుకుని వేలం వేసి ప్రజా సంక్షేమానికి వినియోగించాలని సిపిఐ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. నకిలీ పత్రాలు సృష్టించి కబ్జాకు పాల్పడ్డ వ్యక్తులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని సిపిఐ నాయకులు కోరారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఇ.టి.నర్సింహ్మా, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, సహాయ కార్యదర్శి స్టాలిన్ తదితరులు మాట్లాడుతూ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బాలానగర్ మండల్, కుకట్‌పల్లి గ్రామంలో వారసులు లేని నవాబ్ రయీస్ యార్ జంగ్ బహుదూర్‌కు చెందిన సర్వేనెంబరు 1007లోగల 286 ఎకరాల భూమిని ప్రభుత్వం స్వాదీనం చేసుకోవాలని కోరారు. బహుదూర్ 1960వ సంవత్సరం లో మరణించారని ఆయన మరణం తరువాత ఆ భూమిని ఆయన కుమారుడు ఫజిలత్ హుస్సేన్, అతని తల్లి, సోదరుడు, సోదరీ మణులు పేరుమీద హక్కుగా నమోదు చేయబడిందని, ఆ తరువాత ఒక్కొక్కరు మృతి చెందడం జరిగిందని విచారం వ్యక్తం చేశారు. కాగా సాధిక్‌మొహియుద్దీన్ అనే వ్యక్తి ఆ భూములను బహుదూర్ మనుమడు మహ్మద్‌ఆలీ కొడుకు హషీమ్‌ాలీ అని తప్పుడు పోర్జరీ మోసపూరిత హిబా, గిఫ్ట్ డిడ్ డాక్యుమెంట్లు సృష్టించి అక్రమాలకు పాల్పడ్డారని వారు ఆరోపించారు. హషీమ్‌ాలీ అనే పేరు రికార్డుల్లో ఎక్కడ లేదని ఆ డాక్యుమెంట్లు కేవలం కల్పితమేనని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సృష్టించబడిన ఆ నకిలీ డాకు య్మెంట్లుతో పలు సొసైటీలు, కంపెనీలు, పలువురు వ్యక్తులు బహుదూర్ కుటుంబానికి చెందిన భూములను సొంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ భూములపై రాష్ట్ర ప్రభుత్వం సిబిఐచే విచారణ జరిపించాలని, కబ్జాదారులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి లేఖ రాయడం జరిగిందని వారు తెలిపారు.

## ఫిబ్రవరి 9నుండి 36వ హైదరాబాద్ నేషనల్ బుక్‌ఫెయిర్



సమావేశంలో పాల్గొన్న ఆర్.వాసు, గౌరీశంకర్, శృతికాంత్ భారతి, నారాయణరెడ్డి, యాకూబ్ తదితర కార్యవర్గ సభ్యులు

రవీంద్రభారతి, జనవరి 8 ప్రభాతవార్త : హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ అధ్యక్షతన సోమవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో నూతన బుక్ ఫెయిర్ కార్యదర్శిగా ఆర్.వాసు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా 36వ హైదరాబాద్ నేషనల్ బుక్ ఫెయిర్ తేదీలను కార్యవర్గ సభ్యులు ఖరారు చేశారు. ప్రతీయేటా నగరంలోని ఇందిరా పార్కు వద్ద నున్న సువిశాల ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే బుక్ ఫెయిర్ ఈ సంవత్సరం ఫిబ్రవరి 9 నుండి 19 వరకు ఉంటుందని, పుస్తక ప్రియులు, పాఠకులు ఈ అవకాశాన్ని ఎప్పటివలే సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యవర్గ సమావేశంలో కోశాధికారి పి.రాజేశ్వరరావు, మాజీ కార్యదర్శి శృతికాంత్ భారతి, ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి, కోయ చంద్రమోహన్, సహాయ కార్యదర్శి శోభన్‌బాబు, జనార్ధన్‌గుప్తా, కవి యాకూబ్, శ్రీకాంత్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్



ప్రజావాణికి వచ్చిన దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్, జనవరి 8,ప్రభాతవార్త: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ఆర్జీలను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం రోజు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎప్పటి ఫిర్యాదులను అప్పుడే పరిష్కరించాలని అన్నారు. వివిధ మండలాల తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ తమరిపరిధిలోకి వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈసందర్భంగా మొత్తం 67 అర్జీలు రాగా అందులో గృహనిర్మాణశాఖకు 29, ఇతర శాఖలకు 38 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం రాష్ట్రంలోని గురుకులపాఠశాలల్లో 2024 -25 సంవత్సరంకు గానూ ఐదవతరగతిలో ప్రవేశం కోసం నిర్వహించే పరీక్ష గోడపత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూధన్, ఆర్డీవో రవికుమార్, జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వర్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్, బిసి సంక్షేమశాఖ అధికారి ఆశన్న, జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారి పవన్‌కుమార్ పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న అధికారులు

## శంషీగూడలో అక్రమ నిర్మాణం కూల్చివేత

కూకట్‌పల్లి, జనవరి 8 ప్రభాతవార్త: కూకట్‌పల్లి సర్కిల్ 24 పరిధిలోని శంషీగూడలో అక్రమ నిర్మాణాన్ని స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీం అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సర్కిల్ కార్యాలయం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా నిర్మించే అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇళ్ళను నిర్మించాలంటే తప్పనిసరిగా అనుమతి తీసుకున్న తర్వాతే ఇళ్ళ నిర్మాణ పనులను చేపట్టాలని అధికారులు కోరారు.

## పదోతరగతి ఫలితాలపై విద్యాశాఖ ఫోకస్

- విద్యార్థులకు స్పెషల్ క్లాస్‌లు.. మాక్ టెస్ట్‌లు
- ఉర్దూ మీడియంపైనా ప్రత్యేత దృష్టి
- మెరుగైన ఫలితాలు సాధిస్తామంటూ ధీమా

హైదరాబాద్, జనవరి 8, ప్రభాతవార్త: గెలుపు ఎవరి సొత్తు కాదు.. శ్రమించి చూడు విజయం తప్పక నీవాకిట తలుపుతడుతుంది. విద్యార్థి జీవితంలో పదోతరగతి ఒక మైలురాయి.. వాటి ఫలితాల సాధనకు ప్రత్యేక కార్యాచరణ,శ్రద్ధ వహించి పనిచేస్తే కచ్చితంగా ఉత్తమఫలితాలు సిద్ధిస్తాయి. గత ఫలితాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తుంది. ఫలితాల తగ్గడానికి గల కారణాలను గుర్తిస్తూ వాటికనుగుణంగా ముందుకు వెళ్తుంది. గతేడాది ఏఏపాఠశాలల్లో ఉత్తీర్ణతశాతంతగ్గింది.. ఏపాఠశాలల్లో విద్యార్థులు ఏఏసబ్జెక్ట్‌ల్లో వెనకబడి ఉన్నారో గుర్తించి ప్రణాళికలు రూపొందించింది. గతేడాది టెన్త్‌ఫలితాల్లో వెనకబడిపోవడంతో మళ్ళీ అలాంటి ఫలితాలు పునరావృతం కాకుండా విద్యాశాఖ చర్యలు తీసుకుంటుంది. హైదరాబాద్ జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 1,385, మాధ్యమిక 656, ఉన్నత 1,468, హైయ్యర్ సెకండరీ స్కూళ్లు 13తో కలిపి మొత్తం 3,522 స్కూళ్లు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 8,49,679 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 8వేలమంది పదోతరగతి విద్యార్థులు ఉన్నారు. పరీక్షలు దగ్గరపడుతుండటంతో ఉన్న సమయాన్ని విద్యార్థులను చదివించడంపై ఫోకస్ పెట్టినట్లు విద్యాశాఖ అధికారులు తెలుపుతున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల విధులతో కొంత ఆంతరాయం కలిగినా.. గతేడాదికంటే ఈసారి మెరుగైన ఫలితాలు సాధిస్తామని విద్యాశాఖ అధికారులు తెలుపుతున్నారు. ఈదిశగా ప్రత్యేగ చొరవతో సబ్జెక్టుల్లో



వెనబడిన విద్యార్థుల సందేహాలను నివృతి చేయడానికి, పునశ్చరణ తరగుతలకు అధిక ప్రాధాన్యత నివ్వాలని ఉపాధ్యాయులకు సూచిస్తున్నారు. ప్రతిరోజు పాఠశాలల సమయంతోపాటు దనంగా తరగతులు నిర్వహిస్తూ ఉదయం గంట,సాయంత్రం గంట రెండుగంటల పాటు విద్యార్థులకు అదనపు శిక్షణ ఇస్తున్నారు.

**సీసీఈతో మెరుగైన ఫలితాలు..** పది విద్యార్థులకు సీసీఈపద్దతిలో మాక్ టెస్టులు నిర్వహించడంతో మంచి ఫలితాలు వస్తున్నామని అధికారులు తెలుపుతున్నారు. డిస్టిక్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డ్ (డీసీఈబి) నుంచి మాదిరి ప్రశ్నలు అందిస్తున్నారు. ఏరోజు ఫలితాలను ఆరోజే వెల్లడిస్తున్నారు. దాంతో విద్యార్థులు తాము ఏసబ్జెక్టుల్లో వెనకబడి ఉన్నామో తెలుసుకునే అవకాశం ఉంది. విద్యార్థులు వీక్‌గా ఉన్నసబ్జెక్టుల్లో వారంగా యేయందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవతీసుకునే అవకాశం ఉంది. పీసీసీ విధానంతో పరీక్షలంటే విద్యార్థుల్లో ఉన్న భయాందోళనలు తొలగుతున్నాయని ఉపాధ్యాయులు తెలుపుతున్నారు.

**ఉర్దూ బోధనకు విద్యావాలం టీర్లు..** హైదరాబాద్‌లో ఉర్దూ, ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ ఎక్కువగా ఉన్నందున వాటిపై విద్యాశాఖ ప్రత్యేకదృష్టి సారించింది. గతేడాది కంటే ఈసారి విద్యార్థుల సంఖ్య పెరిగినందున ఆమేరకు ఉత్తీర్ణతశాతం కూడా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. గతేడాది ఉర్దూ మీడియం పాఠశాలల్లో గణితం,భౌతికశాస్త్రం భోదించే ఉపాధ్యాయులు లేకపోవడంతో ఫలితాలపై ఆప్రభావం పడింది. ఈసారి అలాంటి సమస్యలు తలెత్తకూడదనే.. టీచర్లు లేని చోట్ల ఉర్దూ మీడియంలో బోధన చేసే విద్యావాలంటర్లను ప్రత్యేకంగా నియమించారు.

# కంటోన్మెంట్ అభివృద్ధికి నిరంతరం కృషి : ఎమ్మెల్యే లాస్య



:రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో కల్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లాస్య నందిత

కంటోన్మెంట్, జనవరి 8 ప్రభాతవార్త: పేద ప్రజల సంక్షేమం కోసం మాజీ సిఎం కేసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు చరిత్రపుటలో నిలిచే విధంగా ఉన్నాయని కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత తెలిపారు. మారేడ్‌పల్లి మండలం పరిధిలోని రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో 4, అల్లాడి పెంటయ్య నగర్‌లో 1, వాల్మీకి నగర్‌లో 1 కళ్యాణ లక్ష్మీ చెక్కులను సోమవారం ఆమె ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంటోన్మెంట్ నియోజకవర్గం ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తెచ్చినట్లైతే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రజా పాలనలో అభయ హస్తం పథకంలో దర ఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నివేదిత, బత్తుల నారాయణ, సురవి శ్యామ్ సుందర్ రెడ్డి, తేలుకుంట సతీష్‌గుప్త, పెద్దాల నర్సింహ్మ, భాస్కర్ ముదిరాజ్, శివకుమారి, పనస సంతోష్, ఎస్.రాము, అజయ్, రాంమోహన్, దాసరి కర్ణకుమార్, మురళీ యాదవ్, మల్లేశ్, సుషాంత్ రెడ్డి, భవాని మాధురి తదితరులు పాల్గొన్నారు.

**ఎల్‌ఓసీ పత్రాలను అందజేసిన లాస్య..** 7వ వార్డులో నివాసం ఉంటున్న శ్రీదేవికి మెరుగైన వైద్యం కోసం మంజూరైన లక్ష రూపాయల ఎల్‌ఓసీ పత్రాన్ని కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డు నాయకులు కె.బి.శంకర్, ఖదిర్‌వన్‌లు పాల్గొన్నారు.

# ట్యాంక్‌బండ్‌పైన పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరించాలి: శ్రీనివాస్‌గౌడ్



నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వి.శ్రీనివాస్‌గౌడ్

సైఫాబాద్, జనవరి 8 ప్రభాతవార్త: బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేసిన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఆయన జయంతి నాటికి ట్యాంక్‌బండ్‌పైన ఆవిష్కరించాలని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. విగ్రహానికి సంబంధించిన అన్ని పనులు పూర్తైయినాయని ఆగస్టు మాసంలో జరిగే పాపన్న జయంతి రోజును విగ్రహాన్ని ఆవిష్కరించాలని, భారసా ప్రభుత్వ హాయంలో పాపన్న జయంతి, వర్ధంతిలను అధికారపూర్వకంగా నిర్వహించడం జరిగిందన్నారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గౌడ ఐక్య సాధన సమితి రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. గౌడ కులస్థులకు వైన్ షాపులు, బార్ అండ్ రెస్టారెంట్‌ల్లో 20 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని కోరారు. తాను మంత్రిగా ఉన్న కాలంలో ఎంతో కష్టపడి గౌడ్‌ల అభివృద్ధి, సంక్షేమం కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం ఎంతో కృషి చేశానని వివరించారు. అలాంటిది తనపైన గత ఎన్నికల్లో కాంగ్రెస్, బిజెపి ఎక్కటై తనను ఓడించాయని ఆరోపించారు. కుల వృత్తుల వారి కోసం ఏర్పాటు చేసిన ఆత్మగౌరవ భవనాలు ప్రభుత్వం పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశానికి గౌడ ఐక్య సాధన సమితి అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్, మాజీ ఛైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, వివిధ సంఘాల నాయకులు రామ్మోహన్‌గౌడ్, బబ్బూరి బిక్షపతిగౌడ్, ఎడుకొండలు, నర్సింహ్మగౌడ్, ప్రసాద్, మానస తదితరులు పాల్గొన్నారు.

# బస్టాపులో ఇతర వాహనాలు ఆపొద్దు

## వాహనదారులకు అవగాహన కల్పించిన ట్రాఫిక్ పోలీసులు



ఆర్టీసి, ఆటో డ్రైవర్‌లకు అవగాహన కల్పిస్తున్న చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

సికింద్రాబాద్, జనవరి 8 ప్రభాతవార్త: రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలను నిలిపి ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. చిలకలగూడ చౌరస్తా వద్దగల బస్టాప్ వద్ద ఆటోలు, ఇతర వాహనాలు నిలుపుతుండడంతో బస్సులు నడిరోడ్డుపై నిలపాల్సి వస్తుందని, దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చిలకలగూడ చౌరస్తా వద్ద ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యాక్రమాన్ని నిర్వహించారు. బస్టాపులో ఇతర వాహనాలు నిలుపడం, బస్సులు నడిరోడ్డుపై నిలవడం లాంటి వాటి వల్ల ట్రాఫిక్ అంతరాయం కలుగుతోందని, అక్రమ పార్కింగ్ జరిపితే ట్రాఫిక్ జామ్ అయ్యేందుకు అవకాశం ఉందని వాహనదారులకు అవగాహన కల్పించారు. అలాగే చాలాసార్లు ఆర్టీసి బస్సులు కూడా నడిరోడ్డుపై నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవడం లాంటి వాటివల్ల వెనకాల ఉండే ఇతర వాహనదారులు ఆలాగే నిలిచిపోవాల్సి వస్తోందని, ఆర్టీసి బస్సులు కూడా కేవలం బస్టాపులో మాత్రమే నిలపాలని ఆర్టీసీ డ్రైవర్‌లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ రోడ్డుపక్కన వాహనాలను నిలిపి ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి వద్ద, బోయిగూడ వద్ద రోడ్డుపై అక్రమంగా పార్క్ చేసిన వాహనాదారులకు జరిమానాలు విధించారు. గాంధీ ఆస్పత్రి గాంధీవిగ్రహం వాహనాలు నిలుపకుండా తాడుతో కోన్‌లు అడ్డుగా కట్టారు. ఈ కార్యాక్రమంలో చిలకలగూడ ట్రాఫిక్ ఎస్సై కర్ణాకర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



2వ వార్డులో కబ్జాకు గురైన స్థలాన్ని పరిరక్షించాలని సిఈఓ మధుకర్ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీ.ఎన్.శ్రీనివాస్

# ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిరక్షించాలి

కంటోన్మెంట్, జనవరి 8 ప్రభాతవార్త: ఇందిరమ్మ నగర్‌లోని రామాలయం దేవాలయం వద్ద ఓ వ్యక్తి రోడ్డును ఆక్రమించుకున్నాడని అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకొని ఆక్రమణకు గురైన స్థలాన్ని ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్ సోమవారం కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కుమార్ ముదిరాజ్, నాగేశ్, మహేశ్, శ్యామ్ రెడ్డి, స్వామి, రవి, నరేశ్, లాల్ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బాగాంధీ మహిళా కళాశాలకు రానున్న నాక్ పర్యవేక్షణ బృందం

కంటోన్మెంట్, జనవరి 8 ప్రభాతవార్త: సికింద్రాబాద్ వెస్ట్ మారేడ్‌పల్లిలోని కస్తూర్బాగాంధీ డిగ్రీ, పిజి మహిళా కళాశాలకు ఈ నెల 10,11 తేదీల్లో నాక్ పర్యవేక్షణ బృందం విచ్చేయనున్నట్లు కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్, చైర్‌పర్సన్ డాక్టర్ రాజశ్రీ తెలిపారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి 5 సంవత్సరాలకు ఒక సారి అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) కళాశాలలో పర్యవేక్షించి మౌళిక సదుపాయాలు, గ్రంథాలయాలు, ల్యాబ్‌లు, వివిధ విభాగాల పనితీరు, అధ్యాపకుల బోధన, ఎన్‌సీసీ, ఎన్.ఎస్.ఎస్, కార్యకలాపాలను పరిశీలించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసి పాలక మండలి చైర్‌పర్సన్ డాక్టర్ రాజశ్రీ, కో-ఆర్డినేటర్ జి.సునందలు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉపకమిషనర్‌గా వడ్డేపల్లి నర్సిమ్హా




కుత్బుల్లాపూర్, జనవరి 8 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్‌గా వడ్డేపల్లి నర్సింహ్మ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ ఉపకమిషనర్‌గా పని చేసిన నాగమణి బదిలీపై సంతోశ్‌నగర్ సర్కిల్‌కు బదిలీకాగా సంతోశ్‌నగర్ సర్కిల్‌లో ఉప కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వడ్డేపల్లి నర్సింహ్మ కుత్బుల్లాపూర్ సర్కిల్(25)బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన వడ్డేపల్లి నర్సింహ్మ మాట్లాడుతూ ఇప్పటినుండి కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిల్‌లో ప్రతిసోమవారం ప్రజా వాణి కార్యక్రమం విధిగా నిర్వర్తిస్తామని తెలిపారు. పన్నులను సకాలంలో చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. ఎలాంటి ఫిర్యాదులు ఉన్నా తనను నేరుగా సంప్రదించాలని ఇతరుల ప్రమేయం అవసరం లేదని సూచించారు.

# అయ్యప్పస్వామి శరణుఘోషతో మారుమ్రోగిన గాంధీనగర్



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ పావనీ వినయకుమార్

చిక్కడపల్లి, జనవరి 8 ప్రభాతవార్త: గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయం వద్ద స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్పస్వామి మహాపడిపూజోత్సవ కార్యక్రమం సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ వై.అమృత, రచనశ్రీ, కొంతెం దీపిక, విశ్వేశ్వరయ్య, బిఆర్ఎస్ నాయకులు ఎంఎన్.శ్రీనివాసరావు, యువనేత ముఠాజై సింహ, బిజెవైఎం మహంకాళి జిల్లా అధ్యక్షుడు మద్దూరి శివాజీ, బిజెపి నాయకులు ఆనంద్, వెంకటేశ్, మహేందర్‌బాబు, కలకోట అరుణ్‌కుమార్, శివామూదిరాజ్, విశ్వహిందుపరిషత్ రాష్ట్ర నాయకులు, పలువురు ప్రముఖులు, స్థానిక డివిజన్ మహిళలు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అయ్యప్పస్వామి భజన పాటలతో భక్తిపారవశ్యంతో భక్తుల 'అయ్యప్ప శరణుఘోష'తో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. ఈ కార్యక్రమానికి ముందు అయ్యప్పస్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# మహిళలపై హింసను అరికట్టండి

## ప్రొఫెసర్ ఎస్.శాంతకుమారి




సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ శాంతకుమారి తదితరులు

హైదరాబాద్, జనవరి 8,ప్రభాతవార్త: మహిళలపై హింజను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని గైనకాలజికల్ సొసైటీ ఆఫ్ హైదరాబాద్ ఆర్గనైజింగ్ చైర్‌సర్సన్ ప్రొఫెసర్ ఎస్.శాంతాకుమారి అన్నారు. ఈమేరకు మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఫెడరేషన్ ఆఫ్ అబ్‌స్టెట్రిక్ అండ్ గైనకాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా (ఎఫ్‌వోజీఎస్‌ఐ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 66వ ఆల్ ఇండియా కాంగ్రెస్ ఆఫన అంబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ 2024 లో భాగంగా సోమవారం –"ధీర –మహిళలపై హింసను అరికట్టండి "అనేఅంశంపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపదలో ఉన్న మహిళలకు మార్గనిర్దేశం చేసేందుకు సహాయం చేయడానికి ఎఫ్‌వోజీఎస్‌ఐ సభ్యులు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. 9నుంచి 11ఏళ్లగల పిల్లలకు మహిళల హింసపై చైతన్యం కలిగించేందుకు రెండుగంటల ఆన్‌లైన్ కోర్సు ప్రారంభించామన్నారు. ప్రస్తుతం భౌతికంగా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని ఇప్పటివరకు దాదాపు 3700 పాఠశాలలను కవర్ చేశామన్నారు. ఈప్రోగ్రాం కోసం తాము యునిసెస్‌తో కలిసి భారతదేశంలోని అన్ని పాఠశాలల్లో ఈకార్యక్రమాన్ని తప్పనిసరి చేయడమే లక్ష్యం గా పని చేస్తున్నామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ప్రియాం కదత్, విహాబ్ సిఈవో దీప్తిరావు, ప్రొఫెసర్ అనీబ్రిటెన్ కిహారా, డాక్టర్ జయదీప్, డా.మాధురీపటేల్ పాల్గొన్నారు.

# కల్లుగీత కార్మిలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

## రాష్ట్ర బడ్జెట్‌లో గీత కార్మికుల సంక్షేమానికి రూ.5వేల కోట్లు కేటాయించాలి




పసంగిస్తున్న తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.రమణ


చిక్కడపల్లి, జనవరి 8 ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలతో పాటు ప్రత్యేకంగా గీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.రమణ కోరారు. కల్లుగీత రాష్ట్ర అధ్యక్షుడు ఎంవి. రమణ అధ్యక్షతన సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు తీర్మాణాన్ని ప్రవేశపెట్టారు. రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కల్లుగీత కార్మిక సంఘం శుభాకాంక్షలు తెలిపింది. కాంగ్రెస్ మేనిఫెస్టోలో వృత్తిలో ప్రమాదం జరిగి చనిపోయిన వారి కుటుంబాలకు గ్రామపంచాయితీ తీర్మాణం ఆధారంగా ఎక్స్‌గ్రేషియా రూ.10లక్షలు 30 రోజుల్లో ఇస్తామని, జనగాం జిల్లాకు పాపన్నజిల్లాగా మారుస్తామని, పెన్షన్ ప్రస్తుతమిస్తున్న గీత కార్మికులతో పాటు 50 సంవత్సరాలు నిండిన ప్రతి గీత కార్మికుడికి రూ.4వేలు చేయూత పెన్షన్, బెల్ట్‌షాపుల రద్దు చేస్తామని చెప్పడం జరిగిందని, ఇచ్చిన మాట ప్రకారం అమలు చేయాలని అన్నారు. ట్యాంక్‌బండ్‌పై పాపన్న విగ్రహం నెలకొల్పడం, గీత కార్మికులకు ఉపాధి మెరుగుపర్చడం, కార్పొరేషన్‌కు తగిన నిధులు కేటాయించి బలోపేతం చేయడం, వృత్తిలో ప్రమాద నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని, కార్పొరేషన్‌నుంచి వచ్చే ఆర్థిక సహాయం వెంటనే ఇవ్వాలని, ప్రతి కల్లుషాపుకు ఐదెకరాల భూమి, ఏజెన్సీ ఏరియాలోని కల్లుగీత కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.వెంకటనర్సయ్య, పామన గుండ్ల అచ్చాలు, వెంకట మల్లయ్య, సంఘం రాష్ట్ర కార్యదర్శులు చౌగాని సీతారాములు, బూడిద గోపి, ఎస్.రమేశ్‌గౌడ్, బండకింది అరుణ్, మడ్డి అంజిబాబు, సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులఉు మారగాని కృష్ణస్వామి, బోయపల్లి సుధాకర్‌గౌడ్, ఆశన్యగౌడ్, మెరుగు సత్యానారాయణ, మోగేం వెంకటేశ్వరున్ల, రాచకొండ వెంకట్‌గౌడ్, సురుగు రాజేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# 'స్వర్ణయుగ స్వరకర్తలకు స్వరాభిషేకం'

చిక్కడపల్లి, జనవరి 8 ప్రభాతవార్త: అలనాటి మేటి పాటలు నేటికి అజరామరం అని సినీ విజ్ఞానవిశారద ఎస్వీ.రామారావు అన్నారు. సోమవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళావేంకట దీక్షితులు కళావవేదికలో శోభా కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'స్వర్ణయుగ స్వరకర్తలకు స్వరాభిషేకం' కార్యక్రమం నిర్వాహక సంస్థ అధినేత్రి, వ్యాఖ్యాత్రి శోభారాణి ఆధ్వర్యంలో జరిగింది. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఈ గాన కార్యక్రమం అద్భుతంగా సాగింది. తెలుగు చలనచిత్ర రంగంలో పేరు ప్రఖ్యాతలను సంపాదించిన స్వరకర్తలకు సంబంధించిన పాటలను గాయనీ గాయకులు శ్రీకాంత్, దుర్గాసౌజన్య, రమాదేవి, రవికుమార్, విజయకుమార్, రామ్మోహన్‌రావు, సంధ్యారాణి, శ్యామల, వెంకటేశ్వరరావు, వెంకటరావు, లక్ష్మి, అశ్విన్‌కుమార్ తదితరులు అద్భుతంగా గానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సినీ విజ్ఞానవిశారద ఎస్వీ.రామారావు హాజరై అద్భుతంగా గానం చేసిన వారిని సత్కరించి అభినందించారు.

# మాజీ కేంద్రమంత్రి మల్లికార్జున్ విగ్రహాన్ని ఏర్పాటు చేయండి

## సిఎం రేవంత్‌రెడ్డికి కుటుంబ సభ్యుల వినతి



సిఎంను కలిసి మల్లికార్జున్ సతీమణి భాగ్యలక్ష్మీ, కుమారుడు మను

హైదరాబాద్ జనవరి 8,ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమనాయకుడు, మాజీ కేంద్రమంత్రి దివంగత డాక్టర్ మల్లికార్జున్ విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని సిఎం రేవంత్‌రెడ్డికి ఆయన కుటుంబసభ్యులు విననవించారు. ఈమేరకు సోమవారం మల్లికార్జున్ సతీమణి భాగ్యలక్ష్మి, కుమారుడు మను రేవంత్‌రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ప్రముఖ ప్రదేశంలో డాక్టర్ మల్లికార్జున్ విగ్రహ నెలకొల్పడం ద్వారా దేశాభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఉద్యమంలో ఆయన చేసిన కృషిని గుర్తించాలని అభ్యర్థించారు. కాగా డాక్టర్ మల్లికార్జున్ ఇందిరాగాంధీ, పి.పి నర్సింహ్మారావు మంత్రివర్గంలో పనిచేశారు. ఢిఫెన్స్, రైల్వే వంటి కీలకమైన పోర్టుపోలియోలో నిర్వహించారు. అలాగే తెలంగాణ రాష్ట్ర సాధన కోసం దశాబ్దాల పాటు సాగిన పోరాటంలో కీలకపాత్ర పోషించడం తోపాటు మహబూబ్‌నగర్ నుంచి నాలుగు సార్లు లోక్‌సభకు, రెండుసార్లు మెదక్ లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఈకార్యక్రమంలో వారితోపాటు మాజీ ఎమ్మెల్యే గురునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి, కొడంగల్ మున్సిపల్ చైర్మన్ జగదీష్‌రెడ్డి, డిసిసి అధ్యక్షులు ప్రశాంత్‌రెడ్డి, మాజీఎంపిపి ముదప్పరెడ్డి తదితరులు ఉన్నారు.

# ఫార్మసిస్టుల సమస్యలను పరిష్కరించాలి

సైఫాబాద్, జనవరి 8 ప్రభాతవార్త: రాష్ట్రంలోని ఫార్మసిస్టులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కారించాలని ప్రభుత్వ ఫార్మసిస్ట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సర్వ సభ్యసమావేశం డిహెచ్ డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న యూనియన్ ఫౌండర్ నల్ల సోమలన్న మాట్లాడుతూ ఫార్మసిస్టులకు ప్రభుత్వం తగిన స్థానం కల్పించాలని, తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను రద్దు చేసి ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని ఆయన కోరారు. కాగా ఈ సందర్భంగా సమావేశం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. గౌరవ అధ్యక్షుడిగా సోమలన్న, అధ్యక్షుడిగా శ్యామ్‌వడ్డే రాజ్, కార్యదర్శిగా సురేష్, కోశాధికారిగా శిరీష, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా వీరేష్‌బాబు, సలహాదారులుగా పరాబ్‌కుమార్, పాండు, కవిత, ఉపాధ్యక్షులుగా కే.రామచంద్రుడు, రామచంద్రరావు, సునీత, హయగ్రీవాచారి, బుజ్జి, అరుణ్‌కుమార్, ప్రచార కార్యదర్శులుగా ఆలీ, సంయుక్త కార్యదర్శులుగా కె.నాగరాజు, పి.స్వర్ణలత, మహేష్, ప్రీతి ఎన్నికైనారు.

# ఘనంగా స్కూల్ వార్షికోత్సవం



మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావుకు జ్ఞాపికను అందజేస్తున్న ఢీపీఎస్,పల్లవి స్కూల్స్ చైర్మన్ మల్కాకొమురయ్య

తార్నాక, జనవరి 8 ప్రభాతవార్త: పల్లవి మోడల్ స్కూల్ మొదటి వార్షికోత్సవ వేడుకలను నయనోత్సాం,ఉల్లాసంగా జరుపుకున్నారు. విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. నాటక,సాహిత్య,నైపుణ్యాలను అబ్బుతంగా ప్రదర్శించారు. మరో వైపు జుంబా డ్యాన్స్ మరింత ఆకట్టుకుంది. ఈ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే ఎన్.రామచందర్ రావు, ఎన్జీరంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ మాజీ డీన్ విజయఖాదర్ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులకు చదువు, క్రమశిక్షణ, క్రీడలతో పాటు ఇతర రంగాల్లో మంచి శిక్షణ నిస్తున్న పల్లవి,ఢీపీఎస్ విద్యాసంస్థల కృషి గొప్పదన్నారు. విద్యార్థులు చదువులో రాణించి స్కూల్‌కు, తల్లితండ్రులకు, దేశానికి పేరు తీసుకొని రావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఢీపిఎస్, పల్లవి విద్యాసంస్థల చైర్మన్ మల్కా కొమురయ్య మాట్లాడుతూ తమ స్కూల్సలల్లో పిల్లలను అన్ని రంగాల్లో తీర్చిదిద్దేందుకు ప్రణాళికతో శిక్షణనిస్తామని చెప్పారు. అసోసియేట్ వైస్ ప్రసిడెంట్ ఆగ్నా పెర్నాండెజ్, చైర్మన్ మల్లాకొమురయ్య, నోబల్ డైరెక్టర్ కార్తీక్, అకాడమి డైరెక్టర్ సుధ, స్కూల్ ప్రిన్సిపల్, విద్యార్థుల తల్లితండ్రులు హాజరయ్యారు.



హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌లో ప్రముఖ కాస్ప్లేయర్లు మేధా శ్రీవాత్సవ, జోహైర్‌ఖాన్ వర్క్‌షాప్ నిర్వహించారు

# బండి రమేష్‌కు అభినందనలు వెల్లువ

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 8, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని బాలానగర్ నరసాపూర్ చౌరస్తాలో ఉన్న కో ఆపరేటివ్ ఇండస్ట్రీయల్ ఎస్టేట్ ఎంఎస్ఎంఈ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సోమవారం కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా స్థల విషయంపై ఆయనతో చర్చించడం జరిగింది. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. త్వరలోనే ఈ విషయంపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు నర్సింగ్‌రావుగౌడ్, సెక్రటరీ సురేంద్రబాబు, సభ్యులు మహేష్ అగర్వాల్, మధుసూదన్, దిలీప్ రమేష్, శంకర్‌రెడ్డి, పెద్దిరెడ్డి పురుషోత్తంరెడ్డి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు పుష్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయండి

## సింగిరెడ్డి హారివర్ధన్‌రెడ్డి



సింగిరెడ్డి హారివర్ధన్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 8, ప్రభాతవార్త: కూకట్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కార్యకర్తలు శక్తివంచనతో కృషి చేయాలని మేడ్చల్ మల్కాజగిరి జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు, మహిళ నాయకులు సోమవారం హరివర్ధన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో పేద ప్రజానీకానికి సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం గణనీయంగా అభివృద్ధి సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సేరి సతీష్‌రెడ్డి, కె.దినేష్‌కుమార్, అరవింద్‌రెడ్డి, డి.కృష్ణ, రాజేష్, కూకట్‌పల్లి నియోజకవర్గం కో ఆర్డినేటర్ అనిల్‌రెడ్డి, రాజు, కృష్ణ, నహీం, అల్లావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ వర్ధంతి ఘనంగా నిర్వహించుకుందాం

## టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా



ముషీరాబాద్, జనవరి 8, ప్రభాతవార్త: జనవరి 18వ తేదీ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారకరామారావుగారి 29వ వర్ధంతి ఘనంగా నిర్వహించుకుందామని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా పిలుపునిచ్చారు. సోమవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని టీడీపీ హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ వర్ధంతి రోజున ఎన్టీఆర్ ఉదయం 9గంటలకు నారా భువనేశ్వరి ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తారని, అనంతరం 10గంటలకు రాష్ట్ర పార్టీ కార్యాలయం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో రక్తదాన శిబిరం, అనంతరం దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాలకు పోలిట్‌బ్యూరో సభ్యులు, జాతీయ కమిటీ నాయకులు, రాష్ట్ర కమిటీ నాయకులు హాజరవుతారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆరోజు స్థానికంగా ఎన్టీఆర్ చిత్రపటానికి లేదా విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించి, పార్టీ జెండాను ఆవిష్కరించాలని సూచించారు. అదే విధంగా కార్యకర్తలు, నాయకులు అందరూ ఎన్టీఆర్ వర్ధంతి రోజున పేదలకు అన్నదానాలు, పండ్లపంపిణీ వంటి సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, యాదగిరి పాల్గొన్నారు.

## సామాజిక న్యాయ అసమానతలను ప్రతిబింబించే నాటకం దేవుని ఎదుట



నాంపల్లి, జనవరి 8 ప్రభాతవార్త : నేటికీ మన సమాజాన్ని పీడిస్తున్న సామాజిక న్యాయ అసమానతలపై ఆలోచనాత్మకంగా ప్రతిబింబించేలా, రాజకీయ నాయకులు, ప్రముఖ వ్యక్తులతోసహా సంపన్నులకు అనుకూలంగా, ధనిక పేద దొంగలపట్ల న్యాయవ్యవస్థ పక్షపాతంగా వ్యవహరిస్తోందని బహిర్గతం చేసే కథాంశంతో ప్రతీఒక్కరినీ ఆలోచించేటట్లు నటీనటులు అద్భుతంగా ప్రదర్శించిన నాటకం దేవుని ఎదుట ఆకర్షణీయమైన కథనంతో విచ్చేసిన అశేష ప్రేక్షకులను ఆకట్టుకుంది. నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో సెంటర్ ఫర్ ఆర్ట్స్ మీడియా అండ్ సోషల్ వెల్ఫేర్ నిర్వహణలో ఆరుద్ర రచన, డా. అల్తాఫ్ హసన్ ప్రొడక్షన్ డిజైన్, సమ్మెట వెంకటరమణ దర్శకత్వంలో నటులు అర్జున్, చైతన్య, పవన్‌కళ్యాణ్, శివ, నవనాథరెడ్డి, కిరణ్‌మయూరి, చందు, వెంకటేష్, దుర్గ ముఖ్యపాత్రలో సజీవంగా నటించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు.

